# అభాగ్య భారతం ఆకలి తీరేదెపుడు..?

## (17 అక్టోబర్ "అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం" సందర్భంగా)

పేదరికం ఓ బహువ్యాధి లక్షణంగా మారి ప్రపంచ మానవాళిని పట్టి పీడిస్తున్నది. పేదరికం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక బహుముఖీన సమస్యలతో కూడిన విషవలయం. పేదరికంతో నిరక్షరాస్యత, మానవ హక్కుల ఉల్లంఘన, హింస, దోపిడీల, దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలు, జీవన ప్రమాణాలు, అసురక్షిత గృహవసతులు, పోషకాహార లోపం, ఆరోగ్య అభద్రత, ఆకలిచావులు వంటివి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా 1990 విశ్వజనాభాలో 36 శాతం దారిద్ర్యరేఖ దిగువన ఉండగా, 2018 గణాంకాల ప్రకారం 8 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. దక్షిణ ఆసియా, సబ్-సహారా ఆఫ్రికావాసులు అధిక శాతం పేదరికం అనుభవిస్తున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 55 శాతం జనాభాకు కనీసం ఒక సామాజిక రక్షణతో కూడిన ఆర్థిక చేయూతకు దూరంగా ఉన్నారని తేలింది.

### అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం-2024 థీమ్:

1987లో జోసఫ్ వ్రెసిన్స్కి చొరవతో ఫ్రాన్స్, పారిస్ నగరంలో పేదరికం, ఆకలి చావులు, హింస, ప్రాణభయం బారినపడిన ప్రపంచ పౌరుల సమస్యలను చర్చించేందుకు ఒక లక్ష మందితో సమావేశం ఏర్పాటు చేయడం, 1992లో ఈ తీవ్ర సమస్యలకు స్పందించిన ఐక్యరాజ్యసమితి 17 అక్టోబర్ రోజున ప్రతి ఏటా "అంతర్జాతీయ పేదరిక నిర్మూలణ దినం" పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం-2024 థీమ్‌గా "శాంతియుత సమ్మిళిత అభివృద్ధికి సామాజిక, వ్యవస్థీకృత దుర్వినియోగాలకు అంతం పలుకుదాం" అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పించుట జరుగుతున్నది. పేదల దుస్థితిని సహానుభూతితో ఆకలింపు చేసుకొని, పేదరిక నిర్మూలనకు సదాలోచనలు, క్షేత్రస్థాయి ఆచరణలు చేయడానికి ఈ రోజును పాటించాలని సూచిస్తున్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, పేదల బడుగు బలహీన వర్గాల సుస్థిరాభివృద్ధికి కృషి చేయడం ప్రభుత్వాల కనీస భాద్యత అవుతుంది.

### ఐరాస సుస్థిరాభివృద్ధి లక్ష్యం :

2015లో ఐరాస రూపొందించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు-2030' ప్రకారం 2030 నాటికి పేదరికం, ఆకలి లేని ప్రపంచం అవతరించే దిశలో కార్యక్రమాలు రూపొందించాలని మార్గనిర్దేశనం చేస్తున్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకోవడం, వారి గోడును సానుభూతితో ఆలకించడం, పేదరిక నిర్మూలనకు సరైన కార్యాచరణ చేపట్టడం ప్రస్తుత కర్తవ్యంగా ప్రపంచ దేశాలు భావించాలి. పేద పిల్లలకు (బాలురు, బాలికలు) విద్య అందించడంతో భవిష్యత్తులో వారికి ఆర్థికాదాయం పెరగడం, పేదరికం/నిరుద్యోగం తగ్గడం జరుగుతాయి. బాలలకు ఆర్థిక, పౌర, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులను కల్పించడానికి కృషి చేయాలి. ఆహార పదార్థాల ప్రజాపంపిణి, వైద్య సదుపాయాల కల్పన, సురక్షిత నీరు, పరిసరాల పరిశుభ్రత, గర్భవతులకు పోషకాహారం అందించడం, ఉపాధి కల్పన లాంటి ప్రభుత్వ చర్యలు పేదరికాన్ని తగ్గించవచ్చు.

### భారతంలో పేదరికం?..:

అధిక జనాభాగల భారత్‌లో 6.5 శాతం (73 మిలియన్లు) ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారని, గత దశాబ్దకాలంలో 271 మిలియన్లను పేదరిక ఊబిలోంచి బయటకు తీసుకురావడం జరిగిందని నివేదికలు తెలుపుతున్నాయి. ఇండియాలోని ఒక శాతంగా ఉన్న ధనివంతులే 73 శాతం సంపదను అనుభవిస్తుండగా, 670 మిలియన్ల పేదల ఆదాయం ఒక శాతం మాత్రమే పెరిగిందని అంచనా వేశారు. మన దేశంలో అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తుల తగ్గుదల, మౌళిక వసతుల లేమి, ఆర్థికవృద్ధి రేటు తగ్గడం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తక్కువగా ఉండడం, వైద్య ఆరోగ్య వసతుల కొరత, సామాజిక కారణాలు, శ్రమదోపిడి, వాతావరణ కారకాలు లాంటి సమస్యలతో పేదరికం ప్రబలటం జరుగుతున్నది. భారత ప్రభుత్వం ఐఆర్‌డిపి, జవహర్ రోజ్‌గార్ యోజన, గ్రామీణ గృహవసతి, కరువు పనుల కల్పన, వృధాప్య పెన్షన్, అన్నపూర్ణ పథకం, గ్రామీణ ఉపాధి కల్పన, నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన లాంటి పథకాలతో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు అమలు చేస్తున్నది. రాష్ట్రప్రభుత్వాలు ప్రజాపంపిణి ద్వారా ఆహారధాన్యాలను అందిస్తూ, పలు పథకాలతో పేదరిక నిర్మూలన దిశగా చేయూతను ఇస్తున్నారు. భారతదేశంలో పేదరికం ఫలితంగా శిశుమరణాలు(సాలీనా 1.4 మిలియన్లు), పోషకాహారలోపం(61 మిలియన్లు), బాలకార్మిక దురాచారం(12.5 మిలియన్లు), బాలల అవిద్య (25 శాతం), బాల్యవివాహాలు(44.5 శాతం), హెచ్ఐవి-ఏయిడ్స్ (2.7 మిలియన్లు) లాంటి దుష్పరిణామాలు కలుగుతున్నాయి. ప్రజలకు పని కల్పన, పోషకాహార భద్రత, అందరికీ ఉచిత విద్య అమలు ద్వారా మాత్రమే సమాజం ఆరోగ్యంగా, పేదరికానికి దూరంగా జీవించగలుగుతారు.

### పేదరిక అగ్నికి ఆజ్యం పోస్తున్న విపత్తులు:

గత దశాబ్ద కాలంలో విపత్తుల వల్ల పేదలు అదనంగా 143-163 మిలియన్లు పెరిగే ప్రమాదంతో పాటుగా మిలియన్ల ప్రజలకు తీవ్ర ఆకలి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని తెలుస్తున్నది. కరోనా విజృంభనతో ఆహారపదార్థాల సరఫరాలో ఆటంకం ఏర్పడటం, ఆహార కొరత ఎదురుకావడం, నిరుద్యోగం పెరగడం, కొనుగోలు సామర్థ్యం తగ్గడం విధిగా జరగడం చూసాం. వాతావరణ ప్రతికూల మార్పులు, విపత్తులు, కరువులు లాంటి ఏ ఉపద్రవం ఎగిసినా పేదలే ముందు తీవ్రంగా ప్రభావితం కావడం సర్వదా సహజంగా జరుగుతున్నది.

పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం తమ చేయూతను అందిస్తూ, మానవ హక్కులకు పట్టం కట్టి, ఆకలి చావులు లేని సంతోష తోరణాలు నిండిన భారతాన్ని నిర్మించుకుందాం.

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# డిజిటల్ పాలన కోసం ప్రపంచవ్యాప్తంగా ఒక సమగ్ర దృక్కోణం ఆవశ్యకతపై ప్రధాన మంత్రి నిబద్ధతను ప్రత్యేకంగా అభినందించిన పరిశ్రమ నాయకులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: ఢిల్లీలోని భారత్ మండపంలో ఈ రోజు జరిగిన ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్ - వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ (ఐటియు- డబ్ల్యుటిఎస్ఎ) - 2024 సందర్భంగా ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఎనిమిదో ఇండియా మొబైల్ కాంగ్రెస్ ను ప్రారంభించారు. డబ్ల్యుటిఎస్ఎ అనేది ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్, యునైటెడ్ నేషన్స్ ఏజెన్సీ ఫర్ డిజిటల్ టెక్నాలజీస్ ప్రామాణికీకరణ కార్యకలాపాలకు పాలక వర్గ సమావేశం ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతుంది. ఐటియు- డబ్ల్యుటిఎస్ఎ సదస్సును ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో- భారతదేశంలో నిర్వహించడం ఇదే తొలిసారి. ఇది టెలికాం, డిజిటల్, ఐసిటి రంగాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 190 దేశాలకు చెందిన 3,000 మందికి పైగా పారిశ్రామిక నాయకులు, విధాన రూపకర్తలు, సాంకేతిక నిపుణులను ఏకతాటిపైకి తెచ్చిన ఒక కీలకమైన అంతర్జాతీయ సదస్సు.

రిలయెన్స్ జియో-ఇన్ఫోకామ్ లిమిటెడ్ చైర్మన్ శ్రీ ఆకాశ్ అంబానీ మాట్లాడుతూ... భారతదేశ విశేష డిజిటల్ మార్పును శరవేగంగా ముందుకు తీసుకువెళ్లడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వాన్ని ప్రశంసించారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన శ్రీ మోదీ... ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసి) ను సృజనాత్మకత, భాగస్వామ్య సహకారానికి ఒక ముఖ్యమైన వేదికగా నిలబెట్టారని, డిజిటల్ రంగంలో అపూర్వమైన వృద్ధికి సారథ్యం వహిస్తున్నారని ఆయన అన్నారు. 2జీ వేగం సరిపోక ఇబ్బంది పడే స్థాయి నుంచి ప్రపంచంలోనే అతిపెద్ద డేటా మార్కెట్ గా భారత్ ఎదిగిందని అంబానీ పేర్కొన్నారు. మొబైల్ బ్రాడ్ బ్యాండ్ ను అన్వయించుకోవడంలో 155వ స్థానం నుంచి ప్రస్తుత స్థితికి భారత్ ప్రయాణం-ప్రభుత్వం, పరిశ్రమల మధ్య సమన్వయ శక్తికి నిదర్శనమని ఆయన ఉద్ఘాటించారు. జన్ ధన్ ఖాతా వంటి కార్యక్రమాల ద్వారా బ్యాంకింగ్ సేవలకు దూరంగా ఉన్న 530 మిలియన్లకు పైగా భారతీయులను చేర్చుకున్నామని, వీరిలో గణనీయమైన భాగం మహిళలేనని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణల పట్ల మోదీ నిబద్ధత వల్ల దేశంలోని ప్రతి మూలకూ సాంకేతిక పరిజ్ఞానాన్ని చేర్చారని, ఇందులో ఎవరూ వెనకబడిలే ఓరని అంబానీ పేర్కొన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యంగా కృత్రిమ మేధ (ఎఐ)ను వివిధ రంగాల్లో మార్పునకు సాధనంగా ఉపయోగించాలని ఆయన ప్రతిపాదించారు. భారతీయ డేటాను దేశంలోనే ఉంచేందుకు డేటా సెంటర్ విధానాన్ని నవీకరించవలసిన అవసరం ఉందని, ఇది బలమైన ఏఐ అనుకూల వ్యవస్థను ప్రోత్సహించగలదని ఆయన అన్నారు.

భారతీ ఎయిర్ టెల్ వ్యవస్థాపకుడు, చైర్మన్ శ్రీ సునీల్ భారతి మిట్టల్ మాట్లాడుతూ- ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ డిజిటల్ ఇండియా దార్శనికత గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. భారత దేశ టెలికాం ప్రయాణం గురించి మాట్లాడుతూ టెలికాం మౌలిక సదుపాయాలు, డిజిటల్ సాంకేతికతలలో భారత్ సాధించిన విప్లవాత్మక పురోగతిని వివరించారు. 2014లో ప్రధానమంత్రి మోదీ 'డిజిటల్ ఇండియా' దృష్టితో నిజమైన మార్పు ప్రారంభమైందని, ఇది 4జీ విప్లవానికి నాంది పలికిందని అన్నారు. ఇది మన గ్రామీణ ప్రాంతాలతో నివసించే వారితో సహా లక్షలాది మంది స్మార్ట్ ఫోన్లు, అవసరమైన డిజిటల్ సేవలను అందిపుచ్చుకోవడానికి సామర్థ్యాన్ని అందించింది. ఉత్పాదక అనుసంధానిత ప్రోత్సాహక (ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్ -పిఎల్ఐ) పథకం ద్వారా స్థానిక తయారీని ప్రోత్సహించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రధానంగా వివరించారు. టెలికాం పరికరాల తయారీ కేంద్రంగా భారతదేశాన్ని నిలబెట్టారని అన్నారు. "దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు మనం కట్టుబడి ఉన్నాం. ఉత్పాదక అనుసంధానిత ప్రోత్సాహక పథకం వంటి కార్యక్రమాలతో భారత్ ను టెలికాం పరికరాల తయారీ కేంద్రంగా మారుస్తున్నాం" అన్నారు. భవిష్యత్తు ప్రణాళికలను వివరిస్తూ- 5జీ టెక్నాలజీలో భారతదేశం ముందంజలో ఉందని, రాబోయే 12 నుండి 18 నెలల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో దీనిని విస్తృతంగా అమలు చేయాలని యోచిస్తున్నట్లు మిట్టల్ ప్రకటించారు. లో ఎర్త్ ఆర్బిట్ (ఎల్ ఇ ఒ) నెట్ వర్క్ ల సామర్థ్యాలను కూడా ఆయన ప్రస్తావించారు. "ఈ నెట్వర్కులు మన దేశంలోని అత్యంత సవాలుతో కూడుకున్న ప్రాంతాల్లో కనెక్టివిటీలో ఉన్న అంతరాలను అధిగమించేందుకు సహాయపడతాయి. భారతీయులందరికీ వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందుబాటులో ఉండేలా చూస్తాయి" అని అన్నారు.

ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ శ్రీ కుమార మంగళం బిర్లా మాట్లాడుతూ- డిజిటల్ కనెక్టివిటీ ప్రాముఖ్యతను నిరంతరం గుర్తిస్తూ భారతదేశాన్ని మరింత అనుసంధానితంగా శక్తిమంతమైన, సమగ్ర డిజిటల్ దేశంగా మలిచేందుకు సంవత్సరాలుగా అనేక సంస్కరణలను ప్రవేశపెట్టడంలో ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధతను ప్రముఖంగా పేర్కొన్నారు. డిజిటల్ మౌలిక సదుపాయాలను విస్తరించడం, ప్రజలు, వ్యాపారాలకు సమానంగా డిజిటల్ అనుసరణను వేగవంతం చేయడంపై ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన ప్రశంసించారు. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు గరిష్ట మద్దతు అని అర్థం వచ్చే ఎంఎస్ఎంఇ పై ప్రధాన మంత్రి చెప్పిన మాటలను గుర్తు చేసిన శ్రీ బిర్లా... దేశంలో చిన్న వ్యాపారాలకు డిజిటల్ మార్పును ప్రోత్సహించడం ద్వారా గరిష్ట మద్దతును అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని చెప్పారు. 5జీ, ఐఒటి, ఎఐ, క్లౌడ్ సర్వీసెస్ వంటి టెక్నాలజీలపై దృష్టి సారించడంతోపాటు, ఆర్థిక వృద్ధి కోసం భారత ఎంఎస్ఎంఇ లకు సాధికారత కల్పించే డిజిటల్ సానుకూల వ్యవస్థను సృష్టించగలమన్న నమ్మకాన్ని ఆయన వ్యక్తం చేశారు. టెలీ మెడిసిన్ లో 10 కోట్ల టెలికమ్యూనికేషన్ కన్సల్టేషన్ల ఘనతను భారత్ సాధించిందని, ఇది ప్రతి భారతీయుడికి గర్వకారణమని ఆయన అన్నారు. గత సంవత్సరంలో ప్రభుత్వ నియంత్రణ సంస్థలు, పరిశ్రమ పరిష్కరించిన అత్యంత ముఖ్యమైన సమస్యలను ప్రస్తావించిన శ్రీ బిర్లా, స్పామ్, మోసాల నియంత్రణ, వాటి నుంచి రక్షణ కోసం తీసుకున్న చర్యలను వివరించారు. భారత టెలికాం రంగం సామర్థ్యం గురించి మాట్లాడుతూ... డిజిటల్ ఇండియా కోసం ప్రధాన మంత్రి సాహసోపేతమైన దార్శనికతను ఆయన ప్రశంసించారు. ప్రభుత్వ నిరంతర మద్దతుతో తమ వంతు కృషి చేస్తామని, ప్రధాని ఆశిస్తున్న డిజిటల్ ఇండియా భవితవ్యాన్ని సాకారం చేయడంలో సహకరిస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. గత సంవత్సరం నిజంగా విశేషమైనదిగా మారేందుకు కృషి చేసిన ప్రభుత్వం, భాగస్వాములు, మొత్తం టెలికాం సమాజానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

2024 వరల్డ్ టెలికమ్యూనికేషన్స్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ, ఇండియా మొబైల్ కాంగ్రెస్ సందర్భంగా ప్రధాన మంత్రితో కలిసి కార్యక్రమానికి హాజరుకావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నట్లు ఐటీయూ సెక్రటరీ జనరల్ శ్రీమతి డోరీన్ బొగ్డాన్ మార్టిన్ తెలిపారు. ఐటియు, భారతదేశం మధ్య ప్రగాఢ సంబంధాలకు ఇది శక్తిమంతమైన చిహ్నమని అన్నారు. గత సంవత్సరం ఐటియు ఏరియా ఆఫీస్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రితో జరిగిన అర్థవంతమైన సంభాషణను ఆమె గుర్తు చేశారు. కొద్ది వారాల కిందట న్యూయార్క్ లో ప్రపంచ నాయకులు సమావేశమై ఫ్యూచర్ ఒప్పందాన్ని, దాని గ్లోబల్ డిజిటల్ కాంపాక్ట్ ను స్వీకరించడం గురించి ఆమె మాట్లాడారు. అక్కడ డిజిటల్ భవిష్యత్తు గురించి ప్రపంచానికి శక్తిమంతమైన సందేశాన్ని పంపారని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో డిజిటల్ పాలన (గ్లోబల్ డిజిటల్ గవర్నెన్స్) ఆవశ్యకతను ప్రధాని స్పష్టంగా చెప్పారని, డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ను యావత్ ప్రపంచంతో పంచుకోవాలనే భారతదేశ ఆకాంక్షను వ్యక్తం చేశారని ఆమె గుర్తు చేశారు. భారతదేశ జి 20 అధ్యక్ష హోదా సమయంలో డిజిటల్ పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ (డిపిఐ) ప్రధాన ప్రాధాన్యతగా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఐటియు విజ్ఞాన భాగస్వామిగా మారడంపై సంతోషం వ్యక్తం చేశారు. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్ ఫేస్ కు సంబంధించి భారత్ సాధించిన విజయాల నుంచి ప్రపంచం నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని ఆమె స్పష్టం చేశారు. ప్రమాణాలు నమ్మకాన్ని పెంపొందిస్తాయని, మొబైల్ పరికరాల వాడకం ద్వారా ప్రతి భారతీయుని జీవితాన్ని మార్చే సేవలను అందించే సంస్థలు ఉన్నత స్థాయిలో పని చేయడానికి అవి శక్తిని ఇస్తాయని ఆమె చెప్పారు. విశ్వసనీయత, అందరినీ కలుపుకునిపోవడంతోపాటు తాజా సాంకేతికతల పూర్తి సామర్థ్యాన్ని ఇప్పటికీ ఆఫ్ లైన్ లో ఉన్న మానవాళిలో మూడో వంతు సహా ప్రతి ఒక్కరికీ అందిస్తుందని బొగ్డాన్ మార్టిన్ అన్నారు. ఆసియాలోనే ఇదే తొలి సమావేశం అని అంటూ, సాహసోపేతమైన సమిష్టి కార్యాచరణకు ఆమె పిలుపునిచ్చారు. రాబోయే 10 రోజుల్లో గ్లోబల్ డిజిటల్ గవర్నెన్స్ కు పునాదిగా అంతర్జాతీయ ప్రమాణాల పాత్రను బలోపేతం చేయగలమని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. కృత్రిమ మేధ నైతిక ఉపయోగాన్ని కూడా ఆమె ప్రస్తావిస్తూ, సాంకేతిక పురోగతికి అందరినీ డిజిటల్ రంగానికి జోడించాలని కోరారు.

# రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వరల్డ్ ఫుడ్ డే




హైదరాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ ); హైదరాబాద్ రెడ్ క్రాస్ సొసైటీ, కార్యాలయంలో మామిడి భీమ్ రెడ్డి ఆధ్వర్యంలో, వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఆహారం, దాని ప్రాముఖ్యత గురించి, ఆహారాన్ని వృధా చేయకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ఆహారం అవసరము, వృధా చేయడం వల్ల కలిగే దుష్ప్రభావాలను గురించి, పోషకాలు కలిగిన ఆహారం గురించి, ఈ సందర్భంగా మాట్లాడడం జరిగింది, వినియోగదారులను చైతన్యం చేయడంలో ఆహార అవసరాల నుంచి తెలియజేయడంలో, రెడ్ క్రాస్ సొసైటీ ముందు ఉంటుందని భీమ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఉద్యమ నాయకులు శంకర్ లాల్ చౌరాస్య, కె విశ్వేధర్ రాజు, డాక్టర్ హరిప్రియ రెడ్డి , శిల్పా రెడ్డి , స్వర్ణ రెడ్డి, తదితరులు పాల్గొని ప్రసంగించినారు

# ఎంజీఆర్ చిత్తశుద్దే నాకు స్ఫూర్తి : పవన్ కళ్యాణ్

**-అన్నా డీఎంకె పార్టీ అవిర్భావ దినోత్సవం**
**-శుభాకాంక్షలు తెలిపిన జనసేనాని**
**-పేదలు హుందాగా జీవించే హక్కు**
**-ఎంజీఆర్ కల్పించారంటూ కితాబు**

అమరావతి, అక్టోబర్ 17: అన్నాడీఎంకే పార్టీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్ లో పోస్టు చేశారు. ఎంజీ రామచంద్రన్ (ఎంజీఆర్) ఈ పార్టీని స్థాపించి తమిళనాడులో తిరుగులేని రాజకీయ శక్తిగా ఎదిగారన్నారు.

పేదలు, అన్నార్థులకు సాయం చేశారని.. వారికి హుందాగా జీవించే హక్కును కల్పించారని కొనియాడారు. ఆయన పాలనలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేపట్టారని.. తమిళనాడును దేశంలో సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దారన్నారు.

"ప్రజల వర్తమాన అవసరాలను తీర్చడంతో పాటు దీర్ఘకాలిక భవిష్యత్తు, స్థిరాభివృద్ధి కోసం ఎంజీఆర్ గొప్ప పునాది వేశారు.

ప్రజలు, పాలన పట్ల ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని చూసి నేను స్ఫూర్తి పొందా. ఎంజీఆర్ తర్వాత ఆయన ఆశయాలు, నాయకత్వాన్ని జయలలిత విజయవంతంగా కొనసాగించారు. ఎంజీఆర్ ఆశయాలను మరింత ముందుకు తీసుకెళ్లి ప్రజల చేత 'అమ్మ'గా గౌరవాన్ని అందుకున్నారు. పళనిస్వామి నేతృత్వంలో అన్నాడీఎంకే ఎంజీఆర్ విలువల్ని ముందుకు తీసుకెళ్లాలి. ఎన్నో సవాళ్లు ఎదురైనా ఆ పార్టీ తమిళనాడు ప్రజల గొంతుకగా ఉంది. ఇదంతా ఆ పార్టీ విలువల వల్లే సాధ్యమైంది" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# ఆర్టీసీ బస్సు - బైక్ ఢీ ముగ్గురి దుర్మరణం

హైదరాబాద్, అక్టోబర్ 17:వికారాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. పూడూరు గేట్ వద్ద ఆర్టీసీ బస్సు - బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు.

చంగముల్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాదు నుండి కర్ణాటక సేడం వెళుతున్న ఆర్టీసీ బస్సు నెంబర్ టిఎస్ 34 జ్ 0020 గల ఆర్టిసి బస్సు పూడూరు స్టేజి వద్దకు రాగానే పూడూరు మండల మేడికొండ గ్రామానికి చెందిన యువకులు స్పెండర్ బైక్పై మన్నెగూడ వైపు వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొంది.

ఈ ప్రమాదంలో మేడికొండ గ్రామానికి చెందిన నవీన్ కుమార్ 21 సంవత్సరాలు అదే గ్రామానికి చెందిన మరో యువకుడు హర్షవర్ధన్ 15 సం"అక్కడికక్కడే మృతి చెందగా గంగుపల్లి గ్రామానికి చెందిన మరో యువకుడు ఎం ప్రవీణ్ 20 సంవత్సరాలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలు మృతి చెందినట్లు చనుగోముల్ ఎస్సై తెలిపారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు

# ఆర్ అండ్ బి అధికారుల తీరుపై ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం..



మెదక్, అక్టోబర్ 17:ఆర్ అండ్ బీ అధికారులపై దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చేగుంట నుండి గజ్వేల్ కు వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు అవుతున్నప్పటికి ఎందుకు పట్టించుకోవడం లేదని ఆగ్రహించారు. రోజు వందలాది భారీ వాహనాలు ఈ దారి గుండా వెళ్తున్న అనేక వాహనదారులు ఇబ్బందులు పడుతున్న ఎందుకు రిపేర్ చేయలేదంటూ ప్రశ్నించారు. తక్షణమే రోడ్డు మరమ్మతులతో పాటు రోడ్డు ప్రక్కన ఉన్న కరెంటు స్తంభాలను సైతం పక్కకు తొలగించేలా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆర్ అండ్ బీ అధికారులు గుంతలు పడ్డ రహదారిని మరమ్మతు చేయడం కోసం తక్షణ చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట చేగుంట మండల మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధులు అందజేత

చేగుంట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అందజేశారు. సుమారు లక్ష పదిహేను వేల రూపాయల మేర ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందించారు

# లంబాడీలకు వెంటనే మంత్రి వర్గంలో చోటు కల్పించాలి

## - ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ డిమాండ్

హైదరాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ ); లంబాడీలకు వెంటనే మంత్రి వర్గంలో చోటు కల్పించాలని ఎస్సీ ఎస్టీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ డిమాండ్ చేసారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 9 మాసాలు గడిచిన గాని ఇంతవరకు మా లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో మా లంబాడీలు కీలక పాత్ర పోషించారు , తెలంగాణ రాష్ట్ర మొత్తంలో 12% మంది గిరిజనులు ఉన్నాగాని ఇంతవరకు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విస్తరించే క్యాబినెట్ లో తప్పకుండా మా లంబాడీలకు వెంటనే మంత్రి పదవి ప్రకటించాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్ర ప్రభుత్వం లో లంబాడాలకు మంత్రి పదవి తో పాటు సముచిత స్థానం కల్పించాలని లేని ఎడల మా లంబాడీలంతా కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్తాం, అలాగే మా హక్కుల కొరకు రాష్ట్రవ్యాప్తంగా తప్పకుండా పోరాటం చేస్తామని నరసింహ నాయక్ తెలిపారు.

# వెంటనే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

## - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );: కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మరోసారి విరుచుకుపడ్డారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంకా ఎందుకు ప్రారంభించలేదని ఆయన ప్రశ్నించారు. దళారుల చేతుల్లోకి పత్తి వెళ్లాలనే దురుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు పెట్టలేదని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలస్యమైతే ఏం జరుగుతుందో ప్రభుత్వ పెద్దలకు తెలియదా?.. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా పెడితే పత్తి రైతులు బాగా నష్టపోతారని మండిపడ్డారు. పత్తి రైతు నిల్వ ఉంచుకోలేడని తెలిసే ఇవన్నీ చేస్తున్నారని ఆరోపించారు. విధి లేని పరిస్థితుల్లో పత్తిని తక్కువ ధరకే రైతులు అమ్ముకుంటున్నారని.. ఇకనైనా ప్రభుత్వం మేలుకోవాలని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని నిరంజన్ రెడ్డి డిమాండ్ చేశారు.

# జమిలీ ఎన్నికలొస్తున్నాయి.. మళ్లీ మనమే.. జగన్

అమరావతి, అక్టోబర్ 17: జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని.. మళ్లీ మనమే అధికారంలోకి వస్తామని ఏపీ మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ కీలక సూచనలు చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో పార్టీ జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలతో సమావేశమైన ఆయన పలు అంశాలపై చర్చించారు. జమిలీ ఎన్నికలు అంటున్నారని, పార్టీ నేతలు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని కమిటీలు పూర్తి స్థాయిలో పని చేయాలని సూచించారు. ఇంట్లో కూర్చుంటే ఏమీ రాదని, సమస్యలపై పోరాటాలు చేయాలని చెప్పారు. అన్యాయాలపై ధర్నాలు, నిరసనలు తెలిపాలని, బాధితులకు అండగా నిలవాలని తెలిపారు. అలా చేస్తేనే ప్రజల్లో ఉద్భృతమైన స్పందన వస్తుందన్నారు. కష్టపడిన వారికి పార్టీలో అవకాశాలు లభిస్తాయని జగన్ పేర్కొన్నారు. నియోజకవర్గాల వారీగా త్వరలో సమీక్షలు నిర్వహిస్తామని, ఇంచార్జుల పని తీరు మెరుగుపర్చుకోవాలని, చురుగ్గా పని చేసిన వాళ్లకు రేటింగ్స్ ఇస్తామని పార్టీ నేతలకు జగన్ సూచించారు. పూర్తి స్థాయిలో కార్యవర్గాలను ఏర్పాటు చేయాలని నేతలకు పిలుపునిచ్చారు.



# బోధన వృత్తి కాదు అది ఓ సామాజిక 'గురు'తర బాధ్యత

## - లయన్ కెప్టెన్ డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపల్



హైదరాబాద్, అక్టోబర్ 17: బోధన ఒక సాధారణ వృత్తి కాదని, అది భవిష్యత్తు తరాలను నిర్మింపజేసే ఓ గురుతర బాధ్యతని విశ్రాంత ప్రిన్సిపల్, కెమిస్ట్రీ ప్రొఫెసర్ డా: బుర్ర మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ రోజు బూరుగుమడ్ల గ్రామ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా ఉపాధ్యాయులుగా విధుల్లో చేరిన ముగ్గురు ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రేపటి సమాజ నిర్మాతగా, విలువలు కలిగిన భవిష్యత్తు తరాలను తయారు చేసే మహత్తర వృత్తిలో ఇష్టపడి పని చేస్తూ కీర్తిని గడించాలని అన్నారు. బెల్, బిల్ అనే సంస్కృతికి దూరంగా ఎల్లవేళల విధ్యార్థుల పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం ఫలించే విధంగా బోధన సాగాలన్నారు. నాగరిక నైతిక సమాజం ద్వారా మాత్రమే శాంతియుత సమగ్రాభివృద్ధి సుసాధ్యం అవుతుందని తెలిపారు. డిజిటల్ వెలుగుల్లో చిన్నారుల దృష్టిని చదువుల వైపు మరల్చాలని, స్మార్ట్‌ఫోన్ వాడకాన్ని పరిమితం చేస్తూ నవ సమాజ పోకడలను బోధిస్తూ ఉత్తమ బాధ్యతగల పౌరులుగా మలుచుచలో తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలని అన్నారు. యూపిఎస్ ప్రధానోపాధ్యాయుడు మడత శ్రీనివాస్ మాట్లాడుతూ స్కూల్‌లో నేడు ముగ్గురు నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరడంతో అన్ని తరగతుల పిల్లలకు ఉత్తమ బోధనలు అందుతాయనే ఆశాభావాన్ని కలిగించారు. ఈ సందర్భంగా నూతనంగా విధుల్లో చేరిన బండారి దివ్య, గొల్లపెల్లి రాజు, గుగులోతు సంతోష్‌లను డా: బుర్ర మధుసూదన్ రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగదీశ్వరి, సుమన్ కళ్యాణి, చంద్రభాను రాజు, మధుసూదన్, రమేష్, రజనీదేవిలు పాల్గొని ముగ్గురు ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారు.

# మళ్లీ పెరిగిన బంగారం ధరలు..

## తులం గోల్డ్ రూ.78వేలు

హైదరాబాద్ అక్టోబర్ 17 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );పసిడి కొనుగోలు దారులకు మరోసారి షాకిచ్చాయి బంగారం ధరలు. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో బంగారం కొనాలంటే సామాన్య ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో పసిడి ధరలు మరోసారి పెరిగాయి. దీంతో మార్కెట్ లో తులం గోల్డ్ రూ.78వేలకు చేరుఎంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముగల (తులం) బంగారం ధర రూ.450 పెరిగి రూ.71,400కు చేరుకుంది.ఇక, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.490 పెరిగి రూ.77,890గా కొనసాగు తోంది. అయితే, కేజీ వెండిపై రూ.100 తగ్గింది. దీంతో ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.96,800గా ఉంది.

హైదరాబాద్ అక్టోబర్ 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ఏజెన్సీ );పసిడి కొనుగోలు దారులకు మరోసారి షాకిచ్చాయి బంగారం ధరలు. గత కొన్ని రోజులుగా బంగారం ధరలు పరుగులు పెడుతున్నాయి. దీంతో బంగారం కొనాలంటే సామాన్య ప్రజలు భయపడుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో పసిడి ధరలు మరోసారి పెరిగాయి. దీంతో మార్కెట్ లో తులం గోల్డ్ రూ.78వేలకు చేరువైంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 22 క్యారెట్ల 10 గ్రాముగల(తులం) బంగారం ధర రూ.450 పెరిగి రూ.71,400కు చేరుకుంది.

# న్యూఢిల్లీలో 'ఐటియు' వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-2024కు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న్యూఢిల్లీలోని భారత్ మండపం లో ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్ యూనియన్(ఐటియు)- వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-2024 (డబ్ల్యుటిఎస్ఎ) ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇండియా మొబైల్ కాంగ్రెస్ (ఐఎంసి) 8వ మహాసభకూ ఆయన శ్రీకారం చుట్టారు. అనంతరం ఆ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను తిలకించారు.

ఈ సందర్భంగా ప్రధాని ప్రసంగిస్తూ- 'డబ్ల్యుటిఎస్ఎ', 'ఐఎంసి' కార్యక్రమాలకు హాజరైన ఆహూతులకు, ప్రముఖులకు తొలుత స్వాగతం పలికారు. అనంతరం కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి శ్రీ చంద్రశేఖర్ పెమ్మసాని, 'ఐటియు' సెక్రటరీ జనరల్ శ్రీమతి డోరీన్ బోగ్డాన్-మార్టిన్, పలు దేశాల మంత్రులు-ప్రముఖులు, పరిశ్రమాధినేతలు, టెలికాం నిపుణులు, అంకుర సంస్థల యువ ప్రతినిధులు సహా ఇతర ప్రజానీకాన్ని సాదరంగా స్వాగతించారు. తొలి 'డబ్ల్యుటిఎస్ఎ' నిర్వహణకు భారత్‌ను వేదికగా ఎంచుకోవడంపై 'ఐటియు'కు ప్రశంసలతోపాటు ధన్యవాదాలు తెలిపారు.

"టెలికమ్యూనికేషన్లు, సంబంధిత సాంకేతికతల విషయంలో భారత్ అత్యంత ప్రధాన దేశాలలో ఒకటి" అని శ్రీ మోదీ ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా భారత్ విజయాల జాబితాను ఏకరవు పెట్టారు. దేశంలో మొబైల్ వినియోగదారుల సంఖ్య 120 కోట్లు (1200 మిలియన్లు), ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 95 కోట్లు (950 మిలియన్లు)గా ఉందని గుర్తుచేశారు. అంతర్జాతీయ ప్రత్యక్ష డిజిటల్

లావాదేవీలలో 40 శాతం భారత్‌లోనే నమోదవుతున్నట్లు తెలిపారు. ఇక చివరి అంచెదాకా ప్రభుత్వ సేవల ప్రదానంలో డిజిటల్ అనుసంధానం ఎంతటి ప్రభావశీల ఉపకరణం కాగలదో భారత్ నిరూపించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ ప్రమాణాలతోపాటు ప్రపంచ శ్రేయస్సు దిశగా ఈ రంగం భవిష్యత్తుపై లోతైన చర్చల కోసం భారత్‌ను వేదికగా ఎంచుకోవడంపై ప్రతి ఒక్కరినీ ఆయన అభినందించారు.

భారత మొబైల్ కాంగ్రెస్ పాత్ర సేవలతో ముడిపడినది కాగా, అంతర్జాతీయ ప్రమాణాల నిర్దేశమే 'డబ్ల్యుటిఎస్ఎ' లక్ష్యమని ప్రధాని పేర్కొన్నారు. ఈ రెండు కార్యక్రమాలూ సంయుక్తంగా నిర్వహించడంలో ప్రధానాంశం ఇదేనని ఆయన వివరించారు. తద్వారా అంతర్జాతీయ ప్రమాణాలు, సేవలు నేడు ఒకే వేదికపై చర్చకు వస్తాయన్నారు. నాణ్యమైన సేవలు, ప్రమాణాలపై భారత్ దృక్కోణాన్ని వివరిస్తూ- ప్రస్తుత కార్యక్రమాల నేపథ్యంలో 'డబ్ల్యుటిఎస్ఎ' అనుభవం దేశానికి కొత్త శక్తినిస్తుందని చెప్పారు.

ఏకాభిప్రాయ సాధన ద్వారా 'డబ్ల్యుటిఎస్ఎ' ప్రపంచానికి సాధికారత కల్పిస్తే, అనుసంధానం ద్వారా 'ఐఎంసి' ప్రపంచాన్ని బలోపేతం చేస్తుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. అందుకే ఏకాభిప్రాయం, అనుసంధానాలను నేడు ఒకే కార్యక్రమంతో మమేకం చేశామని చెప్పారు. వైరుధ్యాలతో సతమతమయ్యే నేటి ప్రపంచ పరిస్థితుల నడుమ అల్లాడుతున్న నేటి ప్రపంచంలో ఏకీభావం ఆవశ్యకతను ఆయన స్పష్టం చేశారు. ఆ మేరకు భారత్ అనాదిగా 'వసుధైవ కుటుంబకం' జీవన సూత్రంగా మనుగడ సాగిస్తున్నదని గుర్తుచేశారు. భారత్ అధ్యక్షతన జి-20 శిఖరాగ్ర సదస్సు నిర్వహణను ఈ సందర్భంగా ప్రధాని ప్రస్తావించారు. ఈ క్రమంలో ప్రపంచానికి 'ఒకే భూమి-ఒక కుటుంబం-ఒకే భవిష్యత్తు' సందేశమిచ్చామని చెప్పారు. ప్రపంచాన్ని సంఘర్షణ విముక్తం చేయడమేగాక అనుసంధానించడానికీ భారత్ నిరంతరం కృషి చేస్తూనే ఉన్నదని ప్రధానమంత్రి ఉద్ఘాటించారు. "ప్రాచీన పట్టు రహదారి లేదా నేటి సాంకేతిక మార్గం- ఏదైనప్పటికీ భారత్ ఏకైక లక్ష్యం ప్రపంచ అనుసంధానం... ప్రగతికి కొత్త బాటలు వేయడమే'' అని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో స్థానిక-ప్రపంచ సమ్మేళనం వంటి 'డబ్ల్యుటిఎస్ఎ', 'ఐఎంసి'ల ప్రస్తుత భాగస్వామ్యం ఏదో ఒక దేశానికి కాకుండా యావత్ ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చగలమనే గొప్ప సందేశాన్నిస్తాయని ప్రధాని అన్నారు.

"ఈ 21వ శతాబ్దంలో భారత మొబైల్-టెలికమ్యూనికేషన్ రంగాల ప్రయాణం ప్రపంచ దేశాలన్నిటికీ అధ్యయనాంశమే" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు. మొబైల్-టెలికాం రంగాలను ప్రపంచం ఒక సౌకర్యంగా మాత్రమే చూస్తున్నదని ఆయన పేర్కొన్నారు. అయితే, భారత్‌లో టెలికాం కేవలం సంధాన మాధ్యమంగానే కాకుండా సమన్యాయం, అవకాశాల మాధ్యమంగానూ ఉన్నదని తెలిపారు. ధనిక-పేద వ్యత్యాసం లేకుండా గ్రామాలు-నగరాల మధ్య అంతరం తొలగించే మాధ్యమంగా టెలికాం రంగం నేడు దోహదం చేస్తున్నదని చెప్పారు. ఒక దశాబ్దం కిందట దార్శనిక డిజిటల్ ఇండియా కార్యక్రమంపై తన మాటలను ప్రస్తావిస్తూ ఒకటిఅరా పద్ధతికి భిన్నంగా దేశం సమగ్ర విధానంతో ముందుకు సాగాలని తాను పేర్కొన్నట్లు గుర్తుచేశారు. డిజిటల్ ఇండియాకు 'స్వల్ప ధరగల పరికరాలు, దేశం నలుమూలలకూ డిజిటల్ సంధాన విస్తృతి, డేటా సౌలభ్యం, 'డిజిటల్ ఫస్ట్' లక్ష్యాలను నాలుగు కీలక మూల స్తంభాలుగా గుర్తించామని ప్రధాని ఉటంకించారు. వీటన్నిటిపైనా ఏకకాలంలో కృషి చేస్తూ సత్ఫలితాలు సాధించగలిగామని తెలిపారు.

భారత్ ప్రజాస్వామ్యీకరించడమే కాకుండా వివిధ డిజిటల్ వేదికలను సృష్టించిందని తెలిపారు. వీటిద్వారా రూపొందిన ఆవిష్కరణలు లక్షలాది కొత్త అవకాశాలను సృష్టించాయని ఆయన వివరించారు. ఈ సందర్భంగా జన్-ధన్, ఆధార్, మొబైల్ త్రయం పరివర్తనాత్మక సామర్థ్యాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. ఇది కూడా అసంఖ్యాక ఆవిష్కరణలకు పునాది వేసిందన్నారు. అనేక కంపెనీలకు కొత్త అవకాశాలు కల్పించిన ఏకీకృత చెల్లింపు వ్యవస్థ (యుపిఐ)తోపాటు డిజిటల్ వాణిజ్యంలో విప్లవం తెచ్చిన 'ఒఎన్‌డిసి' గురించి కూడా ఉదాహరించారు. ముఖ్యంగా కోవిడ్-19 మహమ్మారి

సమయంలో డిజిటల్ వేదికల పాత్ర, పేదలకు ఆర్థిక లబ్ధి బదిలీ, మార్గదర్శకాల ప్రత్యక్ష చేరవేత, టీకాల కార్యక్రమం, డిజిటల్ టీకా ధ్రువీకరణ ప్రదానం వంటి నిరంతర ప్రక్రియలకు ఇది భరోసా ఇచ్చిందని విశదీకరించారు.

భారత్ సాధించిన ఈ విజయాలన్నటినీ వివరిస్తూ ఈ సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాల (డిపిఐ) అనుభవాన్ని ప్రపంచంతో పంచుకోవడానికి భారత్ సదా సంసిద్ధంగా ఉందని ప్రకటించారు. జి-20కి అధ్యక్షత వహించిన వేళ 'డిపిఐ'కి తామిచ్చిన ప్రాధాన్యాన్ని వివరించారు. భారత డిజిటల్ ఉపకరణ సముచ్చయం ప్రపంచవ్యాప్తంగా సంక్షేమ పథకాల అమలును విస్తృతం చేయగలదని ప్రధాని చెప్పారు. ఈ మేరకు 'డిపిఐ' సాంకేతికతను అన్ని దేశాలతో పంచుకోవడం ఎంతో సంతోషం కలిగిస్తున్నదని పేర్కొన్నారు.

'డబ్ల్యుటిఎస్ఎ' నిర్వహణ నేపథ్యంలో మహిళల నెట్‌వర్క్ కార్యక్రమం ప్రాధాన్యాన్ని శ్రీ మోదీ ప్రముఖంగా ప్రస్తావించారు. మహిళల సారథ్యంలో ప్రగతి దిశగా తాము అవిరళ కృషి చేస్తున్నామని తెలిపారు. జి-20కి భారత్ అధ్యక్షతన సమయంలో ఈ అంశంపై తమ నిబద్ధతను మరింత ముందుకు తీసుకెళ్లామని చెప్పారు. సాంకేతిక వేదికల తోడ్పాటుతో మహిళా సాధికారత ద్వారా సాంకేతిక రంగాన్ని సమ్మిళితం చేసే లక్ష్యంతో భారత్ కృషి చేస్తున్నదని వివరించారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో మహిళా శాస్త్రవేత్తల కీలక పాత్రను, అంకుర సంస్థల్లో మహిళా సహ-వ్యవస్థాపకుల సంఖ్య విస్తృతిని కూడా ఆయన ఉటంకించారు. అలాగే 'స్టెమ్' కోర్సులు అభ్యసించే వారిలో విద్యార్థినులు 40 శాతంగా ఉన్నారని, సాంకేతిక పరిజ్ఞాన నాయకత్వంలో మహిళలకు భారత్ అపార అవకాశాలు కల్పిస్తోందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. వ్యవసాయంలో డ్రోన్ విప్లవాన్ని ప్రోత్సహించే దిశగా 'నమో డ్రోన్ దీదీ' పేరిట ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. దేశంలోని గ్రామీణ మహిళలు నేడు ప్రశంసనీయ స్థాయిలో డ్రోన్లను నిర్వహిస్తున్నారని కూడా శ్రీ మోదీ స్పష్టం చేశారు. డిజిటల్ బ్యాంకింగ్ సహా డిజిటల్ చెల్లింపుల ప్రక్రియను ఇంటింటికీ చేరువ చేయడంలో భాగంగా 'బ్యాంకు సఖి' వ్యవస్థను ఏర్పాటు చేయడంతో ప్రజల్లో అవగాహన విస్తృతమైందని చెప్పారు.

సభ్యదేశాల ప్రతినిధులకు ప్రధానమంత్రి సూచించారు.

బాధ్యతాయుత, నుస్థిర ఆవిష్కరణలకు పిలుపునిస్తూ- నేటి సాంకేతిక విప్లవానికి మానవ-కేంద్రక కోణం జోడించాల్సిన అవసరాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్యల్లో నిర్ణయించే ప్రమాణాలు భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయి కాబట్టి భద్రత, గౌరవం, సమన్యాయం సూత్రాలు ఈ చర్చలకు కేంద్రబిందువుగా ఉండాలన్నారు. ఈ డిజిటల్ ప్రగతిలో ప్రపంచంలోని ఏ దేశం.. ఏ ప్రాంతం.. ఏ సమాజం కూడా వెనుకబడరాదన్నదే మన లక్ష్యం కావాలని స్పష్టం చేశారు. ఆ మేరకు సార్వజనీన, సమతుల ఆవిష్కరణల అవసరం చాలా ఉందన్నారు. మన భవిష్యత్తు సాంకేతిక దృఢత్వం, నైతిక శక్తితో ముడిపడినదిగా మాత్రమేగాక సార్వజనీనత, ఆవిష్కరణల సమ్మేళనంగా ఉండేవిధంగా చూసుకోవాలని పిలుపునిచ్చారు. చివరగా, 'డబ్ల్యుటిఎస్ఎ'కి శుభాకాంక్షలు చెబుతూ, ఈ కార్యక్రమం విజయవంతం కావడంలో సంపూర్ణ

మద్దతునిస్తామని హామీ ఇస్తూ ప్రధానమంత్రి తన ప్రసంగం ముగించారు.

ఈ కార్యక్రమాల్లో కేంద్ర టెలికమ్యూనికేషన్ల శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా, సహాయ మంత్రి శ్రీ చంద్రశేఖర్ పెమ్మసాని సహా పలువురు పరిశ్రమాధిపతులు కూడా పాల్గొన్నారు.

పర్యావరణ వ్యవస్థకు సంబంధించి ప్రస్తుతం పరిశ్రమలు, ప్రభుత్వం, విద్యావేత్తలు, అంకుర సంస్థలు ఇతర కీలక భాగస్వాముల కోసం వినూత్న పరిష్కారాలు, సేవలు, అత్యాధునిక వినియోగ ఉదాహరణల ప్రదర్శనకు ఓ అంతర్జాతీయ వేదికగా మారింది. ఇందులో 400 మందికిపైగా ఎగ్జిబిటర్లు, దాదాపు 900 అంకుర సంస్థలు, 120 దేశాల నుంచి వివిధ భాగస్వామ్య సంస్థలు పాలుపంచుకుంటున్నాయి. ఈ సందర్భంగా 900కుపైగా సాంకేతికత వినియోగ అధ్యయనాంశాలను ప్రదర్శిస్తుంది. అలాగే 100కుపైగా చర్చా గోష్ఠుల నిర్వహణసహా 600 మందికిపైగా జాతీయ, అంతర్జాతీయ వక్తల మధ్య సంభాషణలకు ఆతిథ్యమిస్తుంది.

# సూపర్ సిక్స్ ఏమయ్యాయి.. చంద్రబాబును నిలదీసిన షర్మిల

అమరావతి, అక్టోబర్ 17: ఏపీ మంత్రి మండలి భేటీలో సూపర్ సిక్స్ లో కనీసం ఒక్క సిక్స్ అయినా అమలు చేస్తారు అనుకున్నాం, మహిళలకు శుభవార్త చెప్తారు అని అనుకున్నాం, ఉచిత సిలిండర్లు, ఆర్టీసీ లో ఉచిత ప్రయాణం రెండు లో బడ్జెట్ స్కీమ్ లే .. కానీ బాబు సూపర్ సిక్స్ లు గాలికి కొట్టుకు పోయాయని పీసీసీ చీఫ్ షర్మిలా తీవ్రంగా విమర్శించారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్ లో గురువారం విలేఖరుల సమావేశంలో ఏపీ ప్రభుత్వాన్ని దుమ్మెత్తి పోశారు.

ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, పాత సిక్స్ పోయి కొత్తగా సిక్స్ పాలసీలు వచ్చాయన్నారు. కొత్త పరిశ్రమలు రాష్ట్రానికి వస్తే మంచిదే నని, పెట్టుబడులు రావాలి, ఉద్యోగాలు రావాలి, రూ. 30 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకు వస్తామన్నారని, 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ఆశ చూపారని, కానీ , కానీ ఇవ్వన్నీ అమలుచేసే చిత్త శుద్ధి బాబుకు ఉందా అని షర్మిల ప్రశ్నించారు. అన్నారు . 2014 లో పెద్ద పెద్ద పథకాలు అన్నారు, అమరావతిని సింగపూర్ చేస్తామన్నారు, త్రీడీ గ్రాఫిక్స్ చూపించారని, అప్పుడు చెప్పిన వాటికి, ఇప్పుడు చెప్పిన వాటికి ఏమాత్రం తేడా లేదని, పాత సినిమాకి కొత్త టైటిల్ పెట్టారని షర్మిల విమర్శించారు. బాబు చెప్తుంటే ఈ కథ ఎక్కడో విన్నట్లుగా ఉందని, పాత గిఫ్ట్ కొత్త బాక్స్ లో ఇస్తున్నారని, ఇవి అమలు అవుతాయా లేదా అనే అనుమానాలు పెరుగుతున్నాయన్నారు.

### జాబ్ ఫస్ట్ సరే.. లెక్కలు సరిగా చూడండి

ఒక విషయంలో బాబును స్వాగతిస్తున్నామని, జాబ్ ఫస్ట్ అనే నినాదం మంచిదే, రాష్ట్రంలో నిరుద్యోగం తారా స్థాయిలో ఉంది, ఉద్యోగాలు లేక వలసలు పోతున్నారు, గత 10 ఏళ్లుగా పరిశ్రమలు లేక యువకులు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని, ఈ లెక్కన బాబు చెప్పినట్లు ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇస్తే?5 ఏళ్లలో 20 లక్షల మందికి ఉద్యోగాలు ఇస్తారు, ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు కల్పన జరిగితే మిగతా వాళ్ల సంగతి ఏంటి ఉద్యోగాలు అని గతంలో మోదీ ప్రభుత్వం కూడా మోసం చేసిందన్నారు.

20 కోట్ల ఉద్యోగాలలో మనకు ఎన్ని వచ్చాయని షర్మిల ప్రశ్నించారు. ఒక్క ఉద్యోగం ఇవ్వని మోదీ కి ఎందుకు బాబు మద్దతు ఇస్తున్నారు రాష్ట్రంలో మీరు ఇచ్చే 20 లక్షలకు తోడు మరో 30 లక్షల ఉద్యోగాలు మోదీ ఇవ్వాలని, బాబు కేంద్రాన్ని బాబు డిమాండ్ చేయాలన్నారు. మోడీ, బాబు ఇద్దరు కలిసి కూర్చొని ఉద్యోగాల కల్పన పై వైట్ పేపర్ రిలీజ్ చేయాలని షర్మిల డిమాండు చేశారు . రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల పరిధిలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఎప్పుడు చేస్తారో శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. గత 10 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ కావడం లేదు, మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయి తేల్చాలని, జాబ్ క్యాలెండర్ ప్రకారం అన్ని పోస్టులు భర్తీ చేయాలని షర్మిల డిమాండు చేశారు.

### లోకేష్ బాబూ..మోడీని నిలదీయండి

మోడీకి ఇచ్చిన మాట లోకేష్ నిలబెట్టుకున్నారట, 21 మంది ఎంపీలు ఇస్తామని చెప్పి మరీ ఇచ్చారట, అయ్యా లోకేష్ మీరు ఇచ్చిన మాట సరే మోడీ ఇచ్చిన మాట ఏంటి రాష్ట్రంలోని 25 ఎంపీలు అందరు మోడీకి ఊడిగం చేస్తూనే ఉన్నారు. ఆంధ్ర ప్రదేశ్ కి ప్రత్యేక హోదా ఇస్తామని తిరుపతి లో నిలబడి మోడీ చెప్పారుఆయన ఇచ్చిన మాట ఎక్కడ పోయింది, అని షర్మిల ప్రశ్నించారు. హోదా వచ్చి ఉంటే పరిశ్రమల కోసం ఎక్కడికి పోవాల్సిన అవసరం లేదు పోటీ పడి మరీ పరిశ్రమలు వస్తాయన్నారు. ప్రత్యేక హోదా ఉన్న ఉత్తరాఖండ్ లో 2 వేల పరిశ్రమలు వచ్చాయి, హిమాచల్ ప్రదేశ్ లో దాదాపు 10 వేల పరిశ్రమలు వచ్చాయి, మరి హోదా మీద మోడీ ఇచ్చిన మాట ఎక్కడ పోయిందన్నారు. ఇక పోలవరం నాది భాధ్యత అని మోడీ అన్నారు, అమరావతి రాజధానిని న్యూ ఢిల్లీ మించిన రాజధాని అన్నారు, మట్టి కొట్టి పోయారు, తప్పితే ఒక్క రూపాయి ఇవ్వలేదని షర్మిల విమర్శించారు. వెనుక బడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అన్నారు, ఇవ్వలేదని, విశాఖ స్టీల్ కి ఒక్క క్యాపిటల్ మైన్ ఇస్తే మోడీకి జరిగే నష్టం ఏముంది మోడీని నిలబెట్టి లోకేష్ అడగాలి అని షర్మిల డిమాండ్ చేశారు.

### నిరుద్యోగ భృతి జాడేది

సూపర్ సిక్స్ పాలసీలు సరేసూపర్ సిక్స్ పతకాలు ఎక్కడ పోయాయి నిరుద్యోగ భృతి ఉన్నట్లా లేనట్లా 2014 లోనే మీరు 2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాం అన్నారు, ఇప్పుడు 3 వేలు అంటున్నారు. ఇంత వరకు భృతి పై జాడ లేదు, తల్లికి వందనం నిధుల కోసం పిల్లలు ఎదురు చూస్తున్నారు. మహాలక్ష్మి పథకం కింద 15 వందలు ఇస్తాం అన్నారు ఏమయ్యింది ఉచిత సిలిండర్ల కు దసరా అన్నాడుదీపావళి అన్నారు రేపు సంక్రాంతి అంటారేమో.. అని షర్మిల ఎద్దేవ చేశారు.

ఏడాదికి 2 వేల నుంచి 4 వేల కోట్లకు ఖర్చు అయ్యే పథకానికి నిధులు లేవా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఏమయ్యింది అని ప్రశ్నించారు. హర్యానా ఎన్నికలతో ఏపీ నీ జగన్ ఎలా పోలుస్తారు , జగన్ కు తెలియదు ఏమో- ఇక్కడ ప్రజల నాడికి అనుకూలంగా ఫలితాలు వచ్చాయి, హర్యానా లో ప్రజల నాడికి వ్యతిరేకంగా తీర్పు వచ్చింది . ఏపిలో ఫలితాలు అనుకున్నట్లే వచ్చాయి, జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు చీదరించుకున్నారు అని షర్మిల అన్నారు. ఇక లిక్కర్ విషయంలో జగన్ కి, బాబు కి పెద్ద తేడా లేదన్నారు. జగన్ హయంలో లిక్కర్ మాఫియాకు తాడేపల్లి ప్యాలెస్ కి లింక్ ఉందని, బాబు హయంలో నియోజక వర్గంలోని తమ్ముళ్ళ చేతుల్లో మాఫీయా చేరిందని, లిక్కర్ విషయంలో ఇద్దరు దొందు దొందే అని షర్మిల ఆరోపించారు.

# వర్ధమాన దేశాలకు టెలికాం సేవలు, డిజిటల్ కనెక్టివిటీని అందుబాటులోకి తీసుకురావడంలో భారత్ పాత్ర: పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, అక్టోబర్ 17: భారత దేశం టెలికాం సేవలను అందించడానికి సిద్ధంగా ఉందని.. అభివృద్ధి చెందుతున్న దేశాలకు భారత కంపెనీలు అధిక భద్రత, నాణ్యమైన సాంకేతిక పరికరాలను అందించే సంస్థలుగా మారతాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పియూష్ గోయల్ అన్నారు.

వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ, 8వ విడత ఇండియా మొబైల్ కాంగ్రెస్ ప్రారంభోత్సవంలో మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్తులో అంతర్జాతీయ టెలికాం సరఫరా వ్యవస్థలకు భారత్ నాయకత్వం వహిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమాచార వ్యవస్థలో ఇంకా వెనుకబడి ఉన్న దేశాలకు టెలికాంను తీసుకెళ్లటానికి పరిష్కారాలను కనుగొనాలని కంపెనీలను కోరారు. అభివృద్ధి చెందుతోన్న దేశాల్లో (గ్లోబల్ సౌత్) సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో, ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ కనెక్టివిటీని చౌకగా చేయాలన్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాన్ని (ఎస్‌డీజీ) నెరవేర్చడంలో అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించడంలో భారత్ పాత్ర ఉంది. దేశవ్యాప్తంగా అంతరాయం లేని బ్రాడ్ బ్యాండ్ కనెక్టివిటీ వల్ల భారత్‌కు 'ప్రపంచానికి విశ్వసనీయ భాగస్వామి' అనే పేరు వచ్చిందని ఆయన అన్నారు.

దేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థిరమైన సమాచార వ్యవస్థ ఏర్పడటానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2015లో ప్రారంభించిన ప్రతిష్టాత్మక 'డిజిటల్ ఇండియా' సాధించిన ఘనత అని వాణిజ్య, పారిశ్రామిక శాఖ మంత్రి ప్రధానంగా చెప్పారు. సుపరిపాలనకు, వ్యాపార అవకాశాలను కల్పించడానికి, దేశ ఆర్థిక కార్యకలాపాలను విస్తరించడానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలో ప్రధాని దూరదృష్టిని ఆయన ప్రశంసించారు. భారతదేశం నేడు ఒకే దేశంగా ఆలోచిస్తోందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యువత ఆలోచనలో మార్పుకు నాంది పలికారని, యావత్ దేశ ఆలోచనా విధానాన్ని దేశాభివృద్ధి వైపు మళ్లించారని ఆయన అన్నారు.

2015లో డిజిటల్ వైపు మళ్లే విషయంలో చేసిన కృషి వల్ల కోవిడ్ మహమ్మారి సమయంలో దేశవ్యాప్తంగా అంతరాయం లేకుండా అత్యవసర సేవలను కొనసాగాయని, ఇది ఆటంకం లేకుండా వ్యాపార కార్యకలాపాలు సాగేందుకు దారితీసిందని ఆయన అన్నారు. వివిధ దేశాలు భారతదేశంతో కలిసి పనిచేసినప్పుడు, అధిక నాణ్యత, సరైన, సమర్థవంతమైన ధరతో కూడిన పరిష్కారాలకు హామీ లభిస్తుంది. అంతరాయం లేని కార్యకలాపాల విషయంలో ధీమా లభిస్తుండటంతో తమ గ్లోబల్ కెపాసిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటు కోసం భారత్ వైపు కంపెనీలు చూస్తాయని అన్నారు.

ఆవిష్కరణ, పరికరాల లభ్యత, సేవలు, డేటా వంటి టెలికాం సేవల్లో సాంకేతిక అభివృద్ధి పరంగా అభివృద్ధి చెందిన దేశాల కంటే భారత్ చాలా ముందంజలో ఉందన్నారు. నిన్న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని భారత్ నిర్వహించుకున్నదనీ, భారతదేశాన్ని నాణ్యమైన వస్తువులు, సేవలను అందించే దేశంగా మార్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందనీ అన్నారు. భారత్ చేసే ప్రతి పనిలోనూ దేశ వృద్ధిని ప్రోత్సహించే నాణ్యత ప్రమాణాలు ఉంటాయని ఆయన అన్నారు.

'భవిష్యత్ ఇప్పుడే' అనే ఇతివృత్తాన్ని ప్రస్తావిస్తూ, భారత్ తన భవిష్యత్తు కోసమే కాకుండా ప్రపంచ భవిష్యత్ కోసం పని చేస్తోందని తెలిపారు. ప్రపంచాన్ని ఒకే కుటుంబంగా చేయటంలో డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించటం అంతర్భాగమని అన్నారు. మెషిన్ లెర్నింగ్, కృత్రిమ మేధ, ఇంటెలిజెన్స్, డేటా విశ్లేషణతో కూడిన పూర్తి డిజిటలైజేషన్ వ్యవస్థ దేశంలో తన ముద్రను కలిగి ఉందని పేర్కొన్నారు. ఆవిష్కరణలు, ప్రతిభ, పెద్ద మార్కెట్ అందించే దేశంగా భారత్ గుర్తింపు పొందింది. ఆవిష్కరణ దేశ వృద్ధిని నిర్ణయిస్తుందని.. నిరుపేదలకు, యావత్ ప్రపంచానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించటంలో నాయకుడిగా భారత్‌ను ప్రపంచం గుర్తించిం దని ఆయన అన్నారు.

అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఆయనకు నివాళులు అర్పిస్తున్నట్లు తెలియజేసిన మంత్రి.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఆయన చేసిన కృషిని ప్రపంచవ్యాప్తంగా ప్రశంసించారని, యువతతో ఆయన అనుబంధం ఎల్లప్పుడూ దేశానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని మంత్రి ఉద్ఘాటించారు.

సాంకేతికతకు సంబంధించి భారత్ స్వయం సమృద్ధి సాధించే విషయంలో ఆత్మవిశ్వాసాన్ని నింపినందుకు టెలికాం పరికరాలు, సేవల ఎగుమతి ప్రోత్సాహక మండలి (టీఈపీసీ)ని పీయూష్ గోయల్ అభినందించారు. ప్రపంచ దేశాలతో సమానంగా 5జీని ప్రారంభించిన భారత్ కథ నేడు భిన్నమైనదని అన్నారు. 6జీని ప్రారంభించడంలో, అభివృద్ధి చేయడంలో దేశం అగ్రగామిగా ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. నేషనల్ బ్రాడ్ బ్యాండ్ మిషన్ ద్వారా దేశంలోని ప్రతి మారుమూల ప్రాంతం 5జీ టెక్నాలజీతో ప్రయోజనాన్ని పొందుతుందన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఏఆర్ కానిస్టేబుల్ మృతి

అమరావతి, అక్టోబర్ 17: మన్యం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. విధులకు హాజరయ్యేందుకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి చెందాడు. ఎల్విన్‌పేట పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బుల్లిబాబు గురువారం కురుపాం మండలం జగడ-నీలకంఠంపురం ఘాట్‌రోడ్డు నుంచి బైక్‌పై వెళ్తుండగా అదుపుతప్పింది. దీంతో ఏఆర్ కానిస్టేబుల్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.




# గుంపు మేస్త్రీ అంటే కట్టేటోడు- ఈ చిట్టినాయుడు కూల్చేటోడు

-రేవంత్ పై కెటిఆర్ రుసరుసలు

-తెలంగాణ భవన్ లో బిఆర్ఎస్వి సమావేశం

-రేవంత్ సర్కార్ పై ప్రజలను చైతన్యం చేయాలని పిలుపు




హైదరాబాద్, అక్టోబర్ 17: గుంపు మేస్త్రీ అంటే కట్టేటోడు.. ఈ చిట్టినాయుడు కూల్చేటోడు అని పరోక్షంగా రేవంత్ రెడ్డిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్వీ సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ, సీఎం రేవంత్ రెడ్డి ఉడుత ఊపులకు భయపడబోమని, .. ఈ చిట్టి నాయుడు మనకు ఓ లెక్క కాదు అని స్పష్టం చేశారు.

ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు కోసమే టీఆర్ఎస్ ఆవిర్భావించింది. 14 ఏండ్లు ఎన్నో ఉద్యమ పోరాటాల్లో విద్యార్థి నాయకులు కథానాయకులుగా వ్యవహరించారని గుర్తు చేశారు. కదనరంగంలో విజృంభించి కొట్లాడి ప్రాణత్యాగం చేసిన ప్రతి అమరవీరుడికి పాదాభివందనమని అన్నారు.. పోరాటం మనకు కొత్త కాదని, రాష్ట్రం కోసం 14 ఏండ్ల కొట్లాడామని చెప్పారు. . పెద్ద పెద్ద నాయకులైన రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు వంటి నాయకులతో తలపడి చివరకు తెలంగాణ తెచ్చామని అంటూ . మరి ఈ చిట్టి నాయుడు మనకు ఓ లెక్క కాదు అని అన్నారు..

### హైదరాబాద్ చుట్టూ సముద్రం

హైదరాబాద్ చుట్టూ సముద్రం ఉంది అంటడు రేవంత్ రెడ్డి. ఏ రాయితో నెత్తి పగులగొట్టుకోవాల్నో తెలుస్తలేదు. మొన్న ఓ సారి మాట్లాడుతూ.. మన తెలంగాణలో భాక్రా నంగల్ డ్యామ్ ఉందని చెప్పిండు. రేవంత్ రెడ్డి వల్ల ఇన్ని కొత్త విషయాలు తెలుస్తున్నాయి. రేవంత్ రెడ్డి ప్రకారం విప్రో సీఈవో సత్య నాదెళ్ల.. ఆయనకు ఏం తెల్వదు.. ఎవడన్న చెప్పబోతే వినడు. పిచ్చోడి చేతిలో రాయిలా ఉంది రాష్ట్రం పరిస్థితి ఉందని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇక ప్రస్తుత రేవంత్ పాలనపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని విద్యార్థి నేతలకు కెటిఆర్ పిలుపు ఇచ్చారు. 95 శాతం ఉద్యోగాలు స్థానికులకే దక్కేలా కేసీఆర్ పోరాటం చేశారని అన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో జిల్లాకో మెడికల్ కాలేజీ , జిల్లాకో నర్సింగ్ , గురుకుల పాఠశాలలు 1000 పైచిలుకు లేవని అంటూ ఇవన్నీ తెలంగాణలో ఉన్నాయన్నారు. . గురుకులాల్లో ఒక్కో విద్యార్థి మీద లక్షా 25 వేలు ఖర్చు పెడుతున్నామని,. ఇవన్నీ మనం సాధించిన విజయాలు అని కెటీఆర్ తెలిపారు

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న సినీనటి రాశి



తిరుపతి, అక్టోబర్ 17: సినీ,టీవీ నటి రాశి కుటుంబ సభ్యులతో కలసి గురువారం తిరుమలలోని శ్రీవారిని దర్శించుకున్నారు.

ఉదయం విఐపీ విరామ సమయంలో భర్త, ప్రముఖ దర్శకుడు శ్రీ మునితో కలిసి ఆలయానికి చేరుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలసి స్వామి వారి సేవలో పాల్గొన్నారు .

దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు దంపతులకు వేదశీర్వచనం అందించారు.

ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి పట్టువస్త్రంతో సత్కరించారు. ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన రాశి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో నటించింది. కొన్ని హిందీ సినిమాల్లోనూ, తెలుగు టీవీ సీరియల్‌లోనూ ఆమె నటించింది.

1989 లో వచ్చిన 'మమతల కోవెల' సినిమాలో బాల నటిగా చిత్రసీమలో అడుగు పెట్టిన రాశి 1997 లో జగపతి బాబు 'శుభాకాంక్షలు' సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఆ తర్వాత గోకులంలో సీత, పెళ్లి పందిరి, సుప్రభాతం, గిల్లి కజ్జాలు, స్నేహితులు తదితర హిట్ సినిమాల్లో కథానాయికగా నటించింది.

